శాస్త్రోక్తంగా సుదర్శన నారసింహ హోమం

ఊంజల్ సేవలో భాగంగా అమ్మవారికి హారతి ఇస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట, జూన్ 21 : యాదగిరి గుట్ట లక్ష్మీనరసింహస్వామి వారి సన్నిధిలో సుదర్శన నారసింహ హోమం శాస్త్రోక్తంగా జరిగింది. శుక్రవారం ప్రధానాలయం వెలుపలి ప్రాకార మండపంలోని కల్యాణ మండపంలో సుదర్శన ఆళ్వారులను కొలుస్తూ హవనం జరిపారు. భూతపేత పిశాచాల బాధలు తొలగి, ఇలలోక సుఖాలు, పరలోక మోక్షాలు సిద్ధించే హోమంలో భక్తులు పాల్గొన్నారు. స్వామి, అమ్మవార్లను దివ్య మనోహరంగా ముస్తాబు చేసి గజ వాహనంపై వేంచేపు చేసి వెలుపలి ప్రాకార మండపంలో ఊరేగించారు. స్వామి, అమ్మవార్లకు నిత్య తిరుకల్యాణోత్సవం అత్యంత వైభవంగా సాగింది. లక్ష్మీసమేతుడైన నారసింహస్వామిని ఆరాధిస్తూ సుమారు గంటన్నరకు పైగా నిత్య తిరుకల్యాణ తంతును జరిపారు. కల్యాణమూర్తులను ముస్తాబు చేసి భక్తులకు అభిముఖంగా అధిష్ఠించి కల్యాణ తంతు నిర్వహించారు. తెల్లవారుజామునే ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపారు. అనంతరం తిరువారాధన జరిపి, ఉదయం ఆరగింపు చేపట్టారు. స్వయంభూ ప్రధానాలయంలో స్వామి, అమ్మవార్లకు నిజాభిషేకం జరిపారు. నిజరూప దర్శనంలో స్వయంభూ నారసింహస్వామి భక్తులకు దర్శనమిచ్చారు. స్వామి వారికి తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామికి సహస్రనామార్చన చేపట్టి భక్తులకు స్వామి, అమ్మవార్ల దర్శన భాగ్యం కల్పించారు. ప్రధానాలయ ముఖ మండపంలో స్వామి వారికి ఉదయం నుంచి సాయంత్రం వరకు పలు దఫాలుగా భక్తులతో సువర్ణపుష్పార్చన జరిపించారు. బంగారు పుష్పాలతో దేవేరులకు అర్చన చేశారు. సాయంత్రం స్వామివారికి తిరువీధి సేవ, దర్బార్ సేవ అత్యంత వైభవంగా చేపట్టారు. ఆండాళ్ అమ్మవారికి ఊంజల్ సేవ జరిపారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు దర్శనాలు కొనసాగాయి. అనుబంధ పర్వతవర్ధినీ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో చండీ హోమం స్మార్తగమశాస్త్రరీతిలో జరిగింది. పలువురు భక్తులు పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. సుమారు 12వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. అన్ని విభాగాలను కలుపుకొని స్వామివారి ఖజానాకు రూ.23,34,678 ఆదాయం సమకూరిందని ఆలయ అనువంశిక ధర్మకర్త బి.నరసింహమూర్తి, ఈఓ భాస్కర్‌రావు తెలిపారు.

యువత డ్రగ్స్ బారిన పడొద్దు : ఏసీపీ రమేశ్‌కుమార్

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఏసీపీ రమేశ్‌కుమార్

యాదగిరిగుట్ట, జూన్ 21 : ఎంతో మంది డ్రగ్స్‌కు అలవాటుపడి సర్వస్వం కోల్పోతున్నారని, యువత డ్రగ్స్ బారిన పడకుండా ఉండాలని ఏసీపీ రమేశ్‌కుమార్ అన్నారు. మండలంలోని వంగపల్లి గ్రామంలో స్వామి వివేకానంద ఫార్మసీ కళాశాలలో డ్రగ్స్ దుర్వినియోగంపై విద్యార్థులకు శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డ్రగ్స్ నిర్మూలనపై అవగాహన, మార్గదర్శకాలను సూచించారు. యువతరాన్ని దారి మళ్లించి చెడు మార్గాల్లో నడిపిస్తున్న దురలవాట్లలో మాదక ద్రవ్యాల వినియోగం తీవ్రమైనదన్నారు. డ్రగ్స్‌కు బానిసలైతే కలిగే నష్టాలు, అలవాటు పడకుండా దూరంగా ఉండటానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. డ్రగ్స్‌కు అలవాటుపడి విద్యార్థులు, యువకులు చదువు వదిలి నిర్భాగ్యులవుతున్నారని తెలిపారు. మత్తుకు బానిసైతే డ్రగ్స్ సంపాదించడానికి ఎంతటి ఆకృత్యాలు, నేరాలు చేసేందుకైనా వెనుకాడరని అన్నారు. డ్రగ్స్‌కు బానిసైన వారి సమాచారం హెల్ప్ లైన్ నంబర్లకు ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో సీఐ రమేశ్, కళాశాల డైరెక్టర్లు ఉదయ్‌కుమార్‌రెడ్డి, ప్రిన్సిపాల్ హేమమాలిని, మత్స్యగిరి, వేణుగోపాల్‌రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బీసీ హాస్టల్ పరిశీలన

బీసీ వసతి గృహాన్ని సందర్శించిన అధికారులు

చౌటుప్పల్, జూన్ 21 : పట్టణంలోని బీసీ వెల్ఫేర్ బాలుర వసతి గృహం, ప్రభుత్వ జూనియర్ కాలేజీని జిల్లా నోడల్ అధికారి రమణి, జిల్లా బీసీ సంక్షేమ అధికారి యాదయ్య శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా వసతి గృహాన్ని పరిశీలించి సంబంధిత అధికారులను అడిగి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ వసతి గృహంలో బీసీ విద్యార్థులతో పాటు ఎస్సీ, ఎస్టీ, బీసీ-ఈ మైనార్టీలకు కూడా రాయితీ ప్రవేశం కల్పించనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కాలేజీలో చదివే విద్యార్థులకు మాత్రమే ప్రవేశం కల్పిస్తామన్నారు. ఈ అవకాశాన్ని అర్హులైన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి : సీఐ

యూనిటీ కళాశాలలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ ఎం.ప్రభాకర్‌రెడ్డి

భువనగిరి కలెక్టరేట్, జూన్ 21 : యువత మత్తు, మాదకద్రవ్యాలు, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని రూరల్ సీఐ ఎం.ప్రభాకర్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని యూనిటీ ఫార్మసీ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన మాదక ద్రవ్యాల నిర్మూలన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. మాదకద్రవ్యాలు వాడితే కుటుంబంపై, తనపై, సమాజంపైన దుష్ఫలితాలు పడుతాయన్నారు. కార్యక్రమంలో రూరల్ ఎస్ఐ వి.సంతోష్‌కుమార్, యూనిటీ కళాశాలల డైరెక్టర్ పి.గోవర్ధన్‌రెడ్డి, ప్రిన్సిపాల్ శ్రీనివాస్, పీజీ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.సరిత, ఏఓ సునీత, విద్యార్థులు పాల్గొన్నారు.

పంచాయతీ రికార్డుల పరిశీలన

కొలనుపాకలో గ్రామపంచాయతీ రికార్డులను పరిశీలిస్తున్న డీఎల్‌పీఓ శ్రీకాంత్‌రెడ్డి

ఆలేరు రూరల్, జూన్ 21 : మండలంలోని కొలనుపాక గ్రామపంచాయతీ కార్యాలయాన్ని డీఎల్‌పీఓ శ్రీకాంత్‌రెడ్డి శుక్రవారం తనిఖీ చేశారు. కార్యాలయంలోని రికార్డులను, రిజిస్టర్లను పరిశీలించారు. పంచాయతీ ద్వారా అందుతున్న సేవల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఎంపీఓ సలీమ్, పంచాయతీ కార్యదర్శి రామకృష్ణ ఉన్నారు.

ప్రధాని మోదీ దిష్టిబొమ్మ దహనం

చౌటుప్పల్‌లో ప్రధాన మంత్రి మోదీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

చౌటుప్పల్/ సంస్థాన్ నారాయణపురం, జూన్ 21 : నీట్ ప్రవేశ పరీక్షలో జరిగిన అక్రమాలు, పేపర్ లీకేజీకి నిరసనగా చౌటుప్పల్, సంస్థాన్ నారాయణపురంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం ఆందోళనలు చేపట్టారు. ఈ సందర్భంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ దిష్టిబొమ్మలను దహనం చేశారు. విద్యార్థుల పట్ల కేంద్ర ప్రభుత్వ మొండి వైఖరికి నిరసనగా నినాదాలు చేశారు. తక్షణమే నీట్ పరీక్షను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమాల్లో సింగిల్ విండో వైస్ చైర్మన్ చెనగోని అంజయ్యగౌడ్, కాంగ్రెస్ పార్టీ బ్లాక్, మండల, పట్టణ అధ్యక్షులు ఆకుల ఇంద్రసేనారెడ్డి, బోయ దేవేందర్, సుర్వి నర్సింహ గౌడ్, ఏపూరి సతీశ్, నాయకులు నర్సింహ, ఖయ్యూం, బాలకృష్ణ, చంద్రారెడ్డి, యాదయ్య, షరీఫ్, శంకర్, శ్రీను పాల్గొన్నారు.

అమ్మ ఆదర్శ పాఠశాలల్లో పెండింగ్ పనులు పూర్తి చేయాలి

● కలెక్టర్ హనుమంతు కె.జెండగే

రాజాపేట : మల్లెగూడెం పాఠశాల విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ హనుమంతు కె.జెండగే

రాజాపేట, జూన్ 21 : అమ్మ ఆదర్శ పాఠశాలల్లో పెండింగ్ పనులను సత్వరమే పూర్తి చేయాలని కలెక్టర్ హనుమంతు కె.జెండగే అన్నారు. మండలంలోని మల్లెగూడెం, పారుపల్లి పాఠశాలలను శుక్రవారం ఆయన సందర్శించి చేపట్టిన పనులను పరిశీలించారు. పాముకుంటలోని వన నర్సరీని పరిశీలించారు. అంతకుముందు తాసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ రికార్డులు, ధరణిలో పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ జిల్లా నాయకుడు మోత్కుపల్లి ప్రవీణ్ కుంటలు, చెరువుల మట్టి తరలింపు, అక్రమ ఇసుక రవాణా తోపాటు దూదివెంకటాపురం సోమిరెడ్డి కుంట శిఖం భూమి ఆక్రమణపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కుంట శిఖం సర్వే చేసి ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట ఎంపీడీఓ నాగవేణి, ఎంపీఓ దినకర్, పంచాయతీ కార్యదర్శులు, రెవెన్యూ అధికారులు ఉన్నారు.

ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనది

● జడ్పీ చైర్మన్ సందీప్‌రెడ్డి

సత్యవతి దంపతులను సన్మానిస్తున్న జడ్పీ చైర్మన్ సందీప్‌రెడ్డి

చౌటుప్పల్, జూన్ 21 : అన్ని వృత్తుల కన్నా ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనదని జడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని జిల్లా పరిషత్ హైస్కూల్ ఉపాధ్యాయురాలు కానుగుల సత్యవతి ఉద్యోగ విరమణ సన్మాన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయురాలి దంపతులను ఆయన సన్మానించి మాట్లాడారు. విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేస్తే మంచి గుర్తింపు లభిస్తున్నదన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు, మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్, ప్రముఖ సినీ గాయకుడు సుద్దాల అశోక్‌తేజ పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

● డీఎంహెచ్‌ఓ పాపారావు

చౌటుప్పల్ : యోగా డేలో పాల్గొన్న జూనియర్ కోర్టు జడ్జి మహతి వైష్ణవి

భూదాన్ పోచంపల్లిలో యోగా డే కార్యక్రమంలో పాల్గొన్న డీఎంహెచ్‌ఓ పాపారావు

భువనగిరి పట్టణంలోని న్యూ డైమెన్షన్స్ స్కూల్‌లో యోగా చేస్తున్న విద్యార్థులు

భూదాన్ పోచంపల్లి జూన్ 21 : యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని డీఎంహెచ్‌ఓ డాక్టర్ పాపారావు అన్నారు. పట్టణంలో జిల్లా వైద్యారోగ్య శాఖ, ఆయుష్ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం ప్రపంచ యోగా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలుషిత ఆహారం తినడం, పలు సమస్యలు, టెన్షన్లతో ప్రజలు అనారోగ్యాల బారిన పడుతున్నారని, యోగాతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని అన్నారు. అదేవిధంగా గాంధీ విగ్రహం వద్ద బోధి ధర్మ యోగా హెల్త్ అండ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో యోగ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ చిట్టిపోలు విజయలక్ష్మి మాట్లాడుతూ యోగాతో శారీరక, మానసికోల్లాసం పొందుతారన్నారు. అనంతరం పదో తరగతి పాసైన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కోట విజయభాస్కర్‌రెడ్డి, బోధి ధర్మ యోగా హెల్త్ అండ్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ సీతభాస్కర్ పాల్గొన్నారు.

సంపూర్ణ ఆరోగ్యానికి నిత్యం యోగా చేయాలి

రామన్నపేట (వలిగొండ): సంపూర్ణ ఆరోగ్యం కోసం రోజు యోగా సాధన చేయాలని అదనపు డీఆర్డీఓ సురేశ్ అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా మండలంలోని రెడ్లరేపాక గ్రామంలో శుక్రవారం ఉపాధి హామీ కూలీలతో యోగా సాధన చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోజూ యోగా చేస్తే పరిపూర్ణ ఆరోగ్యంతోపాటు మానసిక ఒత్తిడి తొలగిపోతుందన్నారు. ఎంపీటీసీ నోముల మల్లేశం, ఏపీఓ పరశురాములు, విక్రమ్, వెంకన్న, సునీత, ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

చౌటుప్పల్ : పట్టణంలోని జూనియర్ కోర్టు ఆవరణలో, పైలాన్ పార్కు, లింగోజిగూడెం దివీస్ పరిశ్రమ ప్రాంగణంలో, గాయిత్రి, విశాలభారతీ విద్యా సంస్థల్లో, విద్యానగర్ కాలనీలో యోగా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా యోగా గురువు పాలకూర్ల పాండు యోగాసనాలు ప్రదర్శించారు. ప్రస్తుత సమాజంలో ప్రతి ఒక్కరికీ యోగా అవసరమన్నారు. జూనియర్ కోర్టు ఆవరణలో ఏర్పాటు చేసిన యోగా డేలో జడ్జి మహతి వైష్ణవి పాల్గొన్నారు. అనంతరం ఆయా కేంద్రాల్లో యోగా గురువు పాండును సన్మానించారు.

చౌటుప్పల్ రూరల్ : మండలంలోని దండుమల్కాపురం గ్రామంలో ఉపాధి హామీ కూలీలతో యోగా సాధన చేయించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ శ్రీనివాస్, వీఓఏ రమాదేవి, పంచాయతీ అధికారులు పాల్గొన్నారు.

భువనగిరి కలెక్టరేట్ : యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని ఎంపీపీ నరాల నిర్మల అన్నారు. మండలంలోని బస్వాపురం గ్రామంలో ఉపాధి హామీ కూలీలతో పని ప్రదేశంలో యోగాసనాలు వేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిత్యం యోగా చేస్తే రోగాలు దరిచేరవన్నారు. కార్యక్రమంలో ఏపీఓ గడ్డం బాలస్వామి, పంచాయతీ కార్యదర్శి రాంబాబు, ఫీల్డ్ అసిస్టెంట్ రాములు, ఉపాధి హామీ కూలీలు, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ఆలేరు రూరల్ : దేశ ప్రజలకు వారసత్వ సంపదగా లభించిన గొప్ప మార్గం యోగా అని ఎన్‌సీసీ అధికారి దూడల వెంకటేశ్ అన్నారు. ఆలేరు జడ్పీహెచ్‌ఎస్‌లో నిర్వహించిన యోగా దినోత్సవంలో ఆయన మాట్లాడారు. యోగా రోగ నిరోధక శక్తిని పెంచుతూ నరాల లోపాలను తొలగించేందుకు దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ఎన్‌సీసీ విద్యార్థులు పాల్గొన్నారు.

రాజాపేట : మండలంలోని వివిధ గ్రామాల పాఠశాలల్లో అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు యోగాసనాలు వేశారు.

ఆత్మకూరు(ఎం) : మండల కేంద్రంతోపాటు అన్ని గ్రామాల్లో ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధి హామీ కూలీలు, యువకులు యోగాసనాలు వేశారు. మండల కేంద్రంలో ఎంపీడీఓ నిరంజన్ వలీ, సూపరింటెండెంట్ లోకేశ్వర్‌రెడ్డి, ఏపీఓ రమేశ్, ఏఈఓ మనీషా పాల్గొన్నారు.

బొమ్మలరామారం : మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాల, టీఎస్ మోడల్ స్కూల్‌లో యోగా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు యోగా చేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బీబీనగర్ : మండలంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ మహిళా సైనిక శిక్షణ కళాశాలలో ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ, హెల్త్ విభాగాల ఆధ్వర్యంలో యోగా దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ కార్తీక్ పాయిళ్ల, డాక్టర్ షర్మిల, డాక్టర్ కౌశిక మాట్లాడుతూ యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమన్నారు. ప్రతి ఒక్కరూ యోగాను విధిగా అలవాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఆర్.పాండురంగశర్మ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రామన్నపేట : మండల కేంద్రంలోని ప్రభుత్వ దవాఖాన ఆవరణలో ఏరియా దవాఖాన, ఆయుష్ విభాగం, యువజన మరియు క్రీడల కార్యాలయం స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో యోగా డే నిర్వహించారు. ఈ సందర్భంగా హోమియోపతి డాక్టర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు చినుకాని శివప్రసాద్ విద్యార్థులకు యోగాపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో దవాఖాన సూపరింటెండెంట్ బి.వీరన్న, జిల్లా యువజన క్రీడల అధికారి ధనుంజనేయులు, ఫార్మాసిస్ట్ భుజంగరావు పాల్గొన్నారు. మున్సిపల్ జూనియర్ సివిల్ కోర్టు ఆవరణలో నిర్వహించిన యోగాలో జూనియర్ సివిల్ జడ్జి ఎ.ప్రదీప్, అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఎన్.చందన, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎంఏ మజీద్, న్యాయవాదులు పాల్గొన్నారు.

వలిగొండ : రెడ్లరేపాకలో ఉపాధి హామీ కూలీలతో యోగా సాధన చేయిస్తున్న అదనపు డీఆర్డీఓ సురేశ్, ఏపీఓ పరశురాములు

బీబీనగర్ : రాఘవాపురం సైనిక కళాశాలలో యోగాసనాలు వేస్తున్న విద్యార్థినులు

అధిక ఫీజులను నియంత్రించాలి : ఏఐఎస్ఎఫ్

కలెక్టర్ హనుమంతు కె.జెండగేకు వినతి పత్రం ఇస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

భువనగిరి కలెక్టరేట్, జూన్ 21 : ప్రైవేట్ పాఠశాలల్లో విద్యా వ్యాపారాన్ని అరికట్టాలని కోరుతూ ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టర్ హనుమంతు కె.జెండగేకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పుల శాంతికుమార్ మాట్లాడుతూ భువనగిరి, చౌటుప్పల్, మోత్కూరు, వలిగొండ తదితర మండలాల్లో ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు అధిక ఫీజులు వసూలు చేస్తున్నాయన్నారు. పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్స్, బూట్లు తదితర వస్తువుల పేరుతో విచ్చలవిడిగా డబ్బులు వసూలు చేస్తున్నాయని తెలిపారు. ఈ విషయంపై అనేక మార్లు డీఈఓ దృష్టికి తీసుకెళ్లినా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. ఆరు మండలాలకు ఒక్కరే ఎంఈఓ ఉండడం వల్ల పర్యవేక్షణ లోపంతో ప్రైవేట్ పాఠశాలలు దోపిడీకి పాల్పడుతున్నాయని విమర్శించారు. జిల్లా కేంద్రంలోని కేంద్రీయ విద్యాలయానికి సర్వీస్ రోడ్డు నిర్మించి విద్యార్థులకు ప్రమాదాలు జరుగకుండా చూడాలని కోరారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు సూరారం జానీ, నవీన్, భరత్, వినిల్ పాల్గొన్నారు.

విద్యా వ్యాపారాన్ని అరికట్టాలి : ఎస్ఎఫ్ఐ

పాఠ్య పుస్తకాలు విక్రయిస్తున్న షాపు వద్ద ఆందోళన చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

బొమ్మలరామారం, జూన్ 21 : కార్పొరేట్ పాఠశాలలు, కళాశాలల్లో జరుగుతున్న విద్యా వ్యాపారాన్ని అరికట్టాలని ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి జగన్ అన్నారు. మండల కేంద్రంలో ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు అధిక ధరకు పుస్తకాలు విక్రయిస్తున్న షాపు వద్ద శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిబంధనలు పాటించని పాఠశాలలపై అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రైవేట్ పాఠశాలల్లో పుస్తకాలు విక్రయిస్తే అడ్డుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షుడు మైలారం గణేశ్, నాయకులు రాజశేఖర్, వెంకటేశ్, శంకర్, భరత్ పాల్గొన్నారు.

దివ్యాంగులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

● భువనగిరి ఎంపీపీ నిర్మల

భువనగిరి కలెక్టరేట్, జూన్ 21 : దివ్యాంగులకు ప్రభుత్వం అందించే పథకాలను పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ నరాల నిర్మల అన్నారు. మండలంలోని వీరవెల్లి గ్రామంలో ఆర్టిఫిషియల్ లింబ్స్ మ్యాన్‌ఫ్యాక్చరింగ్ కార్పొరేషన్ ఇండియా (ఆలింకో) సౌజన్యంతో శుక్రవారం దివ్యాంగులకు ఆటోమేటిక్ వెహికిల్స్, ట్రైసైకిళ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ దివ్యాంగుల పట్ల ప్రేమ, ఆప్యాయతలు కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కంచి లలిత, మాజీ సర్పంచ్ తంగెళ్లపల్లి కల్పన, గ్రామ పంచాయతీ కార్యదర్శి సంతోష్, ఉపాధి హామీ టెక్నికల్ అసిస్టెంట్ మానస పాల్గొన్నారు.

'అధిక ఫీజు వసూలు చేస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి'

భువనగిరి అర్బన్, జూన్ 21 : జేఈఈ, ఐఐటీ కోచింగ్‌ల పేరుతో అధిక ఫీజు వసూలు చేస్తున్న ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని తెలంగాణ దళిత సేన రాష్ట్ర అధ్యక్షుడు పి.అంజయ్య, టీసీ నాయకుడు రాందేవ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు డీఈఓ కె.నారాయణరెడ్డికి శుక్రవారం వేర్వేరుగా వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాలల్లో అధిక ఫీజులు తీసుకోవడంతోపాటు పాఠ్య పుస్తకాలు, యూనిఫామ్, ఇతర మెటీరియల్ విక్రయిస్తున్నారని తెలిపారు. అలాంటి పాఠశాలల గదులను సీజ్ చేయాలని కోరారు. కార్యక్రమంలో సున్నం ప్రసాద్, పాక కృష్ణ పాల్గొన్నారు.

అప్పుల బాధతో యువ రైతు ఆత్మహత్య

రామన్నపేట (వలిగొండ), జూన్ 21 : మండలంలోని రెడ్లరేపాక గ్రామంలో అప్పుల బాధతో ఓ యువరైతు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన జోర్క నరేశ్ (31) గత ఏడాది నాలుగెకరాల భూమిని కౌలుకు తీసుకొని పత్తి పంట సాగుచేశాడు. పంట పండకపోవడంతో పెట్టిన పెట్టుబడి తిరిగి రాక, చేసిన అప్పు తీర్చే మార్గంలేక మనస్తాపానికి గురయ్యాడు. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం తన వ్యవసాయ క్షేత్రం వద్దకు వెళ్లి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. మధ్యాహ్నం వరకు ఇంటికి రాకపోవడంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు వ్యవసాయ క్షేత్రం వద్దకు వెళ్లారు. పురుగుల మందు తాగి పడిపోయి ఉన్న నరేశ్‌ను చికిత్స కోసం తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మహేందర్‌లాల్ తెలిపారు. కాగా, మృతుడికి కొద్ది రోజుల క్రితమే వివాహమైంది.

చెరువులో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

రామన్నపేట, జూన్ 21 : మండలంలోని ఇంద్రపాలనగరం పెద్ద చెరువులో శుక్రవారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇంద్రపాలనగరం గ్రామానికి చెందిన జాలర్లు శుక్రవారం చేపలు పట్టేందుకు చెరువు వద్దకు వెళ్లారు. వలకు వ్యక్తి మృతదేహం చిక్కుకోగా.. పోలీసులకు, పంచాయతీ కార్యదర్శికి సమాచారం అందించారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రామన్నపేట ప్రభుత్వ దవాఖానకు తరలించారు. మృతుడు ఏ1 ఫెసిలిటీ అండ్ ప్రాపర్టీ మేనేజర్ ప్రైవేట్ లిమిటెడ్ ఈస్ట్ సెంట్రల్ రైల్వే దానాపూర్ ఐడీ కార్డు (0356) ధరించి ఉన్నాడు. కార్డుపై పాశ్వాన్ తండ్రి రామ్‌లవన్ పాశ్వాన్, చిరునామా భగవాన్‌పూర్ పీఎస్, దామరూన్ అని ఉన్నది. మృతుడు 54 సంవత్సరాల వయస్సు కలిగి బ్లూ కలర్ షర్టు, బ్లూ కలర్ ప్యాంటు ధరించి ఉన్నాడు. పంచాయతీ కార్యదర్శి రసూల్ ఫిర్యాదు మేరకు ఎస్ఐ మల్లయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు. ఆచూకీ తెలిసినవారు 8712662487 నెంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

జయశంకర్ సార్‌కు ఘన నివాళి

నాగారంలో జయశంకర్ విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న బీఆర్ఎస్ పార్టీ నాయకులు

రామన్నపేట (వలిగొండ), జూన్ 21 : తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ సార్ 13వ వర్ధంతిని వలిగొండ, నాగారం గ్రామంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీవేంకటేశ్వర జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు తుమ్మల వెంకట్‌రెడ్డి, నాగారంలో మాజీ జడ్పీటీసీ మొగుళ్ల శ్రీనివాస్ జయశంకర్ విగ్రహాలకు పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో ఎండీ అఫ్రోజ్, పబ్బు స్వామి, కొండూరి వెంకటేశం, ప్రభాకర్, బల్గూరి నరేశ్‌రెడ్డి, సత్యనారాయణ, బర్ల నాగార్జున, ఎండీ సలీం పాల్గొన్నారు.

నిరుద్యోగ భృతి ఇవ్వాలి : డీవైఎఫ్ఐ

కక్కిరేణి గ్రామంలో యువజన